క్లుప్తంగా

10న బీఎస్ఎన్ఎల్ సేవలపై సదస్సు

ఏలూరు (టూటౌన్): బీఎస్ఎన్ఎల్ సేవలపై ఈ నెల 10న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు టెలికాం జనరల్ మేనేజర్ ఎల్ శ్రీను తెలిపారు. సదస్సు స్థానిక మెయిన్‌రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలోని ఆసక్తి గల వినియోగదారులంతా హాజరు కావాలన్నారు.

పారా వెటర్నేరియన్స్ సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు(మెట్రో): పశు సంవర్ధక శాఖలో పని చేస్తోన్న పారా వెటర్నేరియన్స్ సమస్యలు పరిష్కరించాలని పశ్చిమగోదావరి జిల్లా ఏపీ ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఏలూరు ఎన్జీఓ హోమ్‌లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ నాన్ – గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ పోస్టుని గెజిటెడ్ హోదా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. నాయకులు ఆర్ఎస్ హరనాథ్, నెరుసు రామారావు, సేవా నాయక్, మెరుగు ఫణి కుమార్, పితాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు గన్నవరం మండలం చిన్న అవుటపల్లికి చెందిన జాస్తి ఆంజనేయ ప్రసాద్ సోమవారం రూ. 1,11,116 విరాళంగా అందజేశారు. ముందుగా ఆయన కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ కేఎల్ఎస్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

12 నుంచి పారిజాతగిరి బ్రహ్మోత్సవాలు

జంగారెడ్డిగూడెం : గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు, ఈవో మానికల రాంబాబు తెలిపారు. 12న బ్రహ్మోత్సవాల అంకురార్పణ, 13న ధ్వజారోహణం, శేషవాహన సేవ, 14న హనుమంతవాహన సేవ, 15న స్వామి వారి కళ్యాణోత్సవం, 16న గరుడోత్సవం (గ్రామోత్సవం), 17న చక్రస్నానం, గజవాహన సేవ అనంతరం ధ్వజావరోహణము జరుగుతుందన్నారు. బ్రహ్మోత్సవాల బ్రోచర్, గోడపత్రికను సోమవారం ఎమ్మెల్యే ఎలీజా పారిజాతగిరిలోని కల్యాణ మండపంలో ఆవిష్కరించారు. తొలుత ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కార్యక్రమం అనంతరం వేద ఆశీర్వచనం అందించి, స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందించారు.

సేవల్లో మేటి.. రెడ్‌క్రాస్ సొసైటీ


వాటర్ ట్యాంకర్‌ను ఎమ్మెల్యే నాని ద్వారా అందిస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ (ఫైల్)


ఏలూరులో రక్తదానం చేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ (ఫైల్)

- 69 శిబిరాలు, 3,046 యూనిట్ల రక్తం సేకరణ
- తలసేమియా చిన్నారులకు ఉచిత రక్తమార్పిడి

ఏలూరు టౌన్: ప్రపంచ వ్యాప్తంగా రెడ్‌క్రాస్ సొసైటీ సేవల్లో మేటిగా నిలుస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలో సేవా సంస్థల్లో 90 శాతానికి పైగా విరాళాలను సామాజిక సేవలకు వినియోగిస్తోన్న ఏకైక సంస్థగా గుర్తింపు పొందింది. నిత్యం సమాజంలో ఆయా వర్గాలకు ఆదరణగా నిలుస్తూ తనదైన రీతిలో సేవలను అందిస్తోంది రెడ్‌క్రాస్ సంస్థ. ఏలూరు జిల్లాలో రెడ్‌క్రాస్ విశేష సేవలు అందిస్తూ ఇతర స్వచ్ఛంద సంస్థలకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ముఖ్యంగా రెడ్‌క్రాస్ యుద్ధం, ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తేనో సేవలు చేయటమే కాకుండా నిరంతరం ప్రజలకు అవసరమైన సేవలు అందిస్తూ అండగా ఉంటోంది.

సేవలు ఇలా..

ఏలూరు జిల్లాలో గత ఏడాదిలో గోదావరి వరద పోటెత్తి కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని అనేక గ్రామాల ప్రజలు నిరాశ్రయులయ్యారు. వరద బాధితులకు ఎస్‌బీఐ సహకారంతో 1000 డ్రై రేషన్ కిట్లు పంపిణీ చేసింది. 500 కుటుంబాలకు వంట సామగ్రి, హైజీన్ కిట్లు, దుప్పట్లు, పరదాలను పంపిణీ చేసింది రెడ్‌క్రాస్. ఇక ఏలూరు నగరపాలక సంస్థకు వాటర్ ట్యాంకర్‌ను అందజేసింది. ప్రజలకు సకాలంలో నీటిని సరఫరా చేసేందుకు రెడ్‌క్రాస్ సాయం చేసింది. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏలూరు నగరంలో చలివేంద్రాలను ఏర్పాటుచేసింది.

భారీగా రక్తదాన శిబిరాలు

ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 2022–23 ఏడాదిలో జిల్లా వ్యాప్తంగా 69 రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసింది. ఈ ఏడాదిలో రక్తదాతల నుంచి సుమారుగా 3,046 యూనిట్ల రక్తాన్ని సేకరించింది. వీటిలో 3,038 యూనిట్లు రక్తాన్ని వివిధ రోగాలతో బాధపడేవారికి, క్షతగాత్రులకు సరఫరా చేశారు. తలసేమియా చిన్నారులకు సుమారుగా 930 యూనిట్ల రక్తాన్ని ఉచితంగా అందిస్తూ ఆదుకుంటున్నారు. త్వరలోనే రెడ్‌క్రాస్ డయాలసిస్ సెంటర్‌ను సైతం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తోంది.

రెడ్‌క్రాస్ అంటేనే సేవ

ఏలూరు జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ రక్తదాన శిబిరాలు, రక్త సరఫరా మాత్రమే కాకుండా సామాజిక సేవల్లోనూ ముందు వరుసలో ఉంది. కలెక్టర్ ప్రసన్నవెంకటేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్దెత్తున రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశాం. రోగులకు, క్షతగాత్రులకు, తలసేమియా చిన్నారులకు అవసరమైన రక్తాన్ని సేకరించి అందించాం. ప్రజలకు నిత్యం అండగా ఉంటూ సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ రెడ్‌క్రాస్ సేవలు అందిస్తూ తన ప్రాధాన్యతను చాటుకుంది.

– బీవీ కృష్ణారెడ్డి, ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్

రెడ్‌క్రాస్ సేవలు నిరుపమానం

జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి


జీన్ హెన్రీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ లావణ్యవేణి, రెడ్‌క్రాస్ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు

ఏలూరు టౌన్: అంతర్జాతీయ రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు జీన్ హెన్రీ జయంతి రోజున ఆయన గౌరవార్థం ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందని ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. ప్రపంచ రెడ్‌క్రాస్, ప్రపంచ తలసేమియా దినోత్సవ వేడుకలను ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిధిగా హాజరైన జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి రెడ్‌క్రాస్ పతాకాన్ని ఆవిష్కరించి, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ చేపట్టిన ర్యాలీని ప్రారంభించారు. తలసేమియా చిన్నారులకు రక్త మార్పిడి చికిత్స అందించారు. తలసేమియా చిన్నారులను పరామర్శించి పండ్లు, స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా జేసీ లావణ్యవేణి మాట్లాడుతూ ప్రపంచంలో ఏ విపత్తు సంభవించినా రెడ్‌క్రాస్ సంస్థలు ముందుగా స్పందిస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేపడతారని చెప్పారు. రెడ్‌క్రాస్ సొసైటీ అధికారులు, సిబ్బంది, వలంటీర్లకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. తలసేమియా సెంటర్, రక్తదాన శిబిరాలు, మెడికల్ క్యాంపులు నిర్వహించటం, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ రెడ్‌క్రాస్ ముందు వరుసలో ఉంటుందని కొనియాడారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో బాధితులను ఆదుకుంటూ అండగా నిలుస్తున్నామని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే మేరకు అన్ని సేవా సంస్థల్లో రెడ్‌క్రాస్ తన విరాళాల్లో 90 శాతం సేవా కార్యక్రమాలకు వినియోగిస్తుందని చెప్పారు. ఇప్పటి వరకు నాలుగు సార్లు నోబెల్ బహుమతి పొందిన ఏకైక సంస్థ రెడ్‌క్రాస్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే ప్రసాద్, టి.రామారావు, రేవూరి శివప్రసాద్, కడియాల కృష్ణారావు, బీసీహెచ్ నారాయణ, బావిశెట్టి చిరంజీవిరావు, వై.దెబొరా, జి.జ్ఞానవేణి, సీహెచ్ అనూష, రెడ్‌క్రాస్ వలంటీర్లు ఉన్నారు.

ప్రతి ఇంటా పథకాల పంట

గుడివాకలంకలో ఎమ్మెల్యే కొఠారు


గుడివాకలంకలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలతో పేదలు సంతోషంగా జీవిస్తున్నారని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం ఆయన ఏలూరు మండలం గుడివాకలంకలో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొఠారు మాట్లాడుతూ పార్టీ, వర్గ భేదాలు లేకుండా అర్హతున్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకం అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనను మరిపిస్తోందని వివరించారు. లక్షలాది మంది పేదల సొంతింటి కల నెరవేర్చడంతో పాటు పథకాలతో ఆర్థిక భరోసా, ఆరోగ్య భద్రత కల్పించారని కొనియాడారు. పేదల సంక్షేమం, అభివృద్ధికి రూ.కోట్లు వెచ్చిస్తున్నామని చెప్పారు. ప్రతి ఊరులో జగనన్నకాలనీ ఏర్పాటు చేశామన్నారు. రూ.కోట్లు ఖర్చుచేసి ఇళ్ల స్థలాలు మెరక చేస్తున్నట్టు తెలిపారు. కొల్లేరు గ్రామాలకు సురక్షిత తాగునీరు అందించేందుకు కొత్త పైప్‌లైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించామని వివరించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో కొల్లేరు రోడ్లు, గ్రామాల్లో సీసీ రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. మొదట ఆయన ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులను కలిసి పథకాల అమలుపై ఆరా తీశారు. సంక్షేమ పథకాల వల్ల ప్రజలకు జరిగిన మేలును అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులకు ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ చేశారు. సర్పంచ్ జయమంగళ ప్రభావతి, రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, నాయకులు భాస్కరరావు (బాపనయ్య) ముంగర సంజీవ్ కుమార్, తహసీల్దార్ బి.సోమశేఖర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సరళకుమారి, ఇంజినీరింగ్ అధికారులు కృష్ణమోహన్, శ్రీకాంత్, ఎంఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ కిషోర్, పంచాయతీ వార్డు మెంబర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్త పట్టా పొందిన వారికే ఇళ్లు


స్థలాల సమస్యలపై తహసీల్దార్‌ను కలిసిన మహిళలు

ఏలూరు రూరల్: మాదేపల్లి ఇందిరాకాలనీలో కొత్త పట్టాలు పొందిన వారికే ఇళ్లు చెందుతాయని తహసీల్దార్ బి.సోమశేఖర్ అన్నారు. సోమవారం ఇందిరా కాలనీలో కొత్తగా పట్టాలు పొందిన మహిళలు తహసీల్దార్‌ను కలిశారు. గతంలో ఇళ్లు మంజూరైన వ్యక్తులు వచ్చి ఇంటికి తాళం వేస్తున్నారని వాపోయారు. ఇదేమని ప్రశ్నిస్తే ఎనిమిదేళ్ల క్రితమే ప్రభుత్వం తమకు ఇల్లు మంజూరు చేసిందంటూ వాదులాడుతున్నారని వివరించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ సోమశేఖర్ గతంలో ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసినప్పటికీ నివాసం ఉండని లబ్ధిదారుల పట్టాలు రద్దయ్యాయన్నారు. దీనిపై రెండేళ్ల క్రితమే పాత లబ్ధిదారులకు నోటీసులు జారీ చేశామని చెప్పారు. ఐనా స్పందించకపోవడంతో అర్హులకు కొత్త పట్టాలు ఇచ్చి ఇళ్లు కేటాయించామన్నారు. పట్టాలు పొందిన వారికి అడ్డంకులు సృష్టించే వారి వివరాలు సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆర్ఐ, వీఆర్వోలకు ఫోన్‌లో ఆదేశించారు. పాత పట్టాలు రద్దయినప్పటికీ అర్హత గల వారు దరఖాస్తు చేసుకుంటే 90 రోజుల్లో ప్రభుత్వం జగనన్న కాలనీలో స్థలాలు మంజూరు చేస్తుందని తహసీల్దార్ చెప్పారు.

అంధుల సమాఖ్య ఏలూరు కార్యవర్గ విస్తరణ


అంధుల సమాఖ్య ఏలూరు కార్యవర్గ సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జాతీయ అంధుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ శాఖకు అనుబంధంగా పి.సురేష్‌బాబు అధ్యక్షతన ఏర్పడిన ఏలూరు యూనిట్ కార్యవర్గ విస్తరణ సోమవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఏలూరు యూనిట్ ఉపాధ్యక్షులుగా ఎం.హరిబాబు, డి.సామ్రాజ్యం, డి.ప్రసన్న భారతి, ప్రధాన కార్యదర్శిగా ఎం.జగదీష్, సంయుక్త కార్యదర్శులుగా బి.ప్రభాకరరావు, కె.జయరాజు, యువ కార్యదర్శిగా టి.అనూష, కోశాధికారిగా ఎం.హేమ సుందర్ ఎన్నికయ్యారు. ముఖ్యఅతిథిగా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోపూరి రామ సుబ్బయ్య, ఉపాధ్యక్షుడు ధూళిపాళ శ్రీనివాసరావు, తూర్పుగోదావరి యూనిట్ ప్రధాన కార్యదర్శి సి.సుబ్బారావు, కృష్ణా యూనిట్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర రెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	46
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	05-07
బెండకాయలు	30	కంద	48
పచ్చిమిర్చి	40-44	బీట్‌రూట్	34
కాకర కాయలు	40-44	కీరా దోస	26
బీరకాయలు	34	ఫ్రెంచ్‌బీన్స్	96
బీరకాయలు (పందిరి)	44	అల్లం	22
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	30-34	పాలకూర	08-12
దొండకాయలు	20	చుక్కకూర	08-12
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	16	బఠాణీ	--
అనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	13
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	20
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	18

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	15
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	15
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	17
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	10
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	12
ఏలూరు – బీహెచ్ఈఎల్	22.15	34820	14
ఏలూరు –బీహెచ్ఈఎల్	09.00	4794	32
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు – బెంగళూరు	14.00	4021	--
ఏలూరు –తిరుపతి	16.00	4830	30

కేంద్రంపై అల్లూరి స్ఫూర్తితో ఉద్యమిద్దాం


జూట్‌మిల్లు సెంటర్లోని అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): అల్లూరి స్ఫూర్తితో మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధమవుదామని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. అల్లూరి 99వ వర్ధంతి సందర్భంగా పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో స్థానిక జూట్‌మిల్లు సెంటర్ వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశ సహజ వనరుల్ని అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్‌లకు అప్పగిస్తోన్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై అల్లూరి పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలన్నారు. నాడు అల్లూరి బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మన్యంలో సాయుధంగా ఉద్యమించాడని కొనియాడారు. నేడు మోదీ ప్రభుత్వం ఫాసిస్ట పాలనతో ప్రజల మధ్య మత విభజన సృష్టిస్తోందని విమర్శించారు. నూతన అటవీ హక్కుల చట్టంతో కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను అడవి నుంచి తరిమి వేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. లైగింక వేధింపులపై న్యాయం చేయాలని రెజ్లర్లు ఆందోళన చేస్తుంటే కనీస చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. విశాఖ ఉక్కు, ఎల్ఐసీ, బ్యాంకింగ్ లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు తాకట్టు పెడుతోన్న ప్రధాని మోదీ ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులు, కౌలు రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఇఫ్టూ నగర అధ్యక్షుడు ఎర్రా శ్రీను, పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు యం.క్రాంతి, తేజ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం


వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న నరసింహారావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వేసవి సెలవుల్లో విద్యార్థులు ఇతర వ్యాపకాలవైపు మరలకుండా వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడు వై.నరసింహారావు సూచించారు. సోమవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రాంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో విద్యార్థులకు చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, స్పోకెన్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారన్నారు. బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఏలూ రు శాఖ నిర్వాహకురాలు బీకే లావణ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్ బాబు పాల్గొన్నారు.

- మహిళా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభించారు. గ్రంథపాలకురాలు యాగంటి శ్రీదేవి మాట్లాడుతూ ఈ విజ్ఞాన శిబిరం జూన్ 11 వరకు నిత్యం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో చిత్రాలయ రాంబాబు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు ఈదుబిల్లి సుశీల, మజ్జి కాంతారావు, బేతా పద్మావతి, బి.హిమాచలేశ్వరి, బి.జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీల ద్వారా రైతులకు మెరుగైన సేవలు

ద్వారకాతిరుమల: విశాల సహకార పరపతి సంఘాల(సొసైటీలు) ద్వారా తమ ప్రభుత్వంలో రైతులకు మెరుగైన సేవలు అందుతున్నాయని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారు సుమారు రూ. 2 కోట్లతో అభివృద్ధి చేసిన ద్వారకాతిరుమల సొసైటీ పెట్రోల్ బంకును గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, స్థానిక సొసైటీ ఛైర్‌పర్సన్ గుర్రాల లక్ష్మణ్, పర్సన్‌లు చుక్కా నరసింహారావు, కనికెల్లి వరలక్ష్మితో కలసి సోమవారం ప్రారంభించారు.ఆయన పురోహితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు తదితరులతో కలసి పెట్రోల్, డీజిల్ పంపులను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఆ తరువాత పలువురు వినియోగదారులకు ఎమ్మెల్యే స్వయంగా పెట్రోల్ కొట్టారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సీనియర్ మేనేజర్ పారుపల్లి సత్యారావు, డివిజనల్ మేనేజర్ కె.వెంకటేష్ మూర్తి, సేల్స్ ఆఫీసర్ కోరుపొల్లు సంజీవి, సొసైటీ చైర్‌పర్సన్‌లు గోపా నాగేశ్వరరావు, ముల్లంగి వెంకట్రామిరెడ్డి, చెరుకూరి ప్రసాదరావు, అంబటి గాంధి, ఉక్కుర్తి వెంకట్రావు, యిమ్మడి నాగు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, శ్రీవారి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు మానుకొండ సుబ్బారావు, చెలికాని బుల్లియ్య, సర్పంచ్‌లు దాకారపు బంగారమ్మ, కస్సే శ్రీహరిరావు, లక్కాబత్తుల సిద్ధిరాజు, బండారు ధనలక్ష్మి, పసుపులేటి ఏసుబాబు, కామిరెడ్డి శ్రీను, చవల రమేష్, ప్రత్తిపాటి యోహాను, బొండాడ వెంకన్నబాబు, ఎంపీటీసీలు మానుకొండ కన్నయ్య, పల్లపాటి ధర్మారావు, అల్లాడ హరేరామకృష్ణ, తదితరులున్నారు.

యువకుడు అదృశ్యం

పెదపాడు :ఓ యువకుడు అదృశ్యంపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పెదవేగి మండలం జానంపేటకు చెందిన బబ్బూరి ప్రభుకుమార్ విజయరాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి చదివాడు. సెలవులు కావడంతో గుడివాడ సమీపంలోని తమలంపాడు గ్రామంలో ఉంటున్న అమ్మమ్మ గంగారత్నం ఇంటికి వెళ్లాడు. అక్కడ నుంచి ఆదివారం ఏపూరులోని చర్చికి కూటమికి అమ్మమ్మతో కలిసి వెళ్లాడు. ఉదయం 10గంటలకు చర్చికి చేరుకున్న ఇద్దరూ ప్రార్థనలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో మనవడు ప్రభు కనపడకపోవడంతో చుట్టుప్రక్కలా వెతికారు. ఆచూకి లేకపోవడంతో గంగారత్నం ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై బీ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కేసులు ఎత్తివేయాలి

ఏలూరు(మెట్రో): ఉపాధ్యాయులపై పెట్టిన కేసులు, సస్పెన్షన్‌లను ఎత్తివేయాలని ఏపీ జేఏసీ అమరావతి ఏలూరు జిల్లా నాయకులు కోరారు. ఏలూరు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనలో ఏపీ జేఏసీ అమరావతి ఏలూరు జిల్లా చైర్మన్ కె.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు బి.రాంబాబు, ఎ.ప్రమోద్ కుమార్, కె.రవిచంద్రరావు, ఆర్.వీరబాబు, వివిధ ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో మోదీ విఫలం


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

ఏలూరు (టూటౌన్): ధరల నియంత్రణలో ప్రధాని మోదీ విఫలమయ్యారని ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కన్వీనర్ కొండేటి బేబి ఆరోపించారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించి, సిలిండర్ రూ.600లకే అందించాలని స్థానిక కలెక్టరేట్ వద్ద మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బేబి మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్యాస్ ధర మోయలేని పరిస్థితి వచ్చిందన్నారు. మహిళలపై లైంగిక దాడులు, అత్యాచారాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఐద్వా నగర కన్వీనర్ పి.హైమావతి, జిల్లా మహిళా నాయకులు మన్నవ యామిని, లక్ష్మి సౌభాగ్యం, ఉప్పులూరి లక్ష్మి, కె.సుధ, జి.స్వాతి, ఐద్వా జిల్లా నాయకురాలు హరీషా దుర్గ తదితరులు పాల్గొన్నారు.